పాకీది

[కథానిక]

= శ్రీ అనిశెట్టి సుబ్బారావు =

౧

బడిగంట కొట్టగానే పిచ్చుకల్లాగా ఎగిరిపోతున్నారు పిల్లలు. సాయంత్రపు సూర్యుడు తడి మబ్బుల్లోంచి జారిపోతున్నాడు. బజారులో ఎర్రని పల్చని ఎండ ఇండ్లనీడలు సాచుతున్నది. పిల్లలు వీధి తిరిగి ఇళ్లవేపు మళ్లారు. పంతులుగారు సీనయ్య ఏపిల్లాణ్ణో పిలిచి శనగపప్పు నములుతూ సంచి చేతపట్టుకు రమ్మన్నాడింటివరకూ. కోటిగాడి మనస్సు నాగుతోనే వెడదామని పెనగులాడుతున్నది. బిక్కముహంతో నాగుపై చెయ్యి తీసి ఆ కూరగాయలసంచి నెత్తుకున్నాడు కోటి.

నాగుకు పంతులుగారు సీనయ్యంటే మహా భయంగా వున్నా అతనికూడా కోటితో ఎగురుతూ పాడుతూ వెళ్లాలనే.

"మాష్టారూ! మాష్టారూ! మానాన్న నన్నూ... కోటినీ... తీసుకురమ్మన్నాడండి...ఏమండోయ్!" అన్నాడు నాగు ప్రక్కగా చూస్తూ, ధైర్యం బిగబట్టి.

పంతులుగారు నాగుజేబులోంచి ఇంకోగుప్పెడు శనగపప్పు తీసి బొక్కుతూ "అరేయ్! నిజంగానా... చెప్పూ!" అన్నాడు. "ఐతే మీనాన్నగారూళ్లోనే వున్నారూ!—ఫో వెధవ!" అని గదిమాడు కోటిని.

భారం తప్పిపోయిందంతే చాలని కోటీ, నాగూ ఒక్కపెట్టున పరుగెత్తారు. ఇద్దరూ శనగపప్పు నములుతూ "జేబులో పోసుకున్నా తీసుకున్నాడ్రా!" అన్నారు పంతుల్ని గురించి.

"నాజేబులో కానీలన్నీ వీడి ముహాన్నే పెట్టా. లేకపోతే బిళ్లంగోడు కొనుక్కునేవాణ్ణే!" అంటూ నవ్వుతూ మెడ నున్న పుస్తకాల సంచీ సర్దుకున్నాడు నాగు.

కిల్లీకొట్టుదగ్గర్నుంచి నాగుఇంటికి ఇంకో వీధి దూరం వెళ్లాలి. కొట్టుదగ్గర సిగరెట్టంటించుకొంటూ టెన్నిసుకు వెళ్లబోతున్నాడు నాగుతండ్రి. భాస్కరరావు. సుందరయ్యదూరాన్నుంచే కనిపెట్టాడు నాగూ, కోటీ పరుగెత్తుకురావడం. సైకిల్ హేండిల్ వోరగా పట్టుకొని భాస్కరరావుతో "అదుగోరోయ్! మీవాడొస్తున్నాడు ... ఎప్పుడో వాణ్ణొకణ్ణెవణ్ణో ఎత్తుకొస్తాడు...కోర్టుకు రమ్మనరాదూ... ఈ వెధవసరుకంతా వొదిలిపోతుంది. అటూ ఇటూ బంతులైనా ఎగరేస్తాడు." అన్నాడు. నాగుతండ్రి తలఎత్తి చూసేప్పటికే సుందరయ్య పిలుస్తున్నాడు: "ఓహోహో! మిస్టర్ నాగూ! హలో...హలో... ఇట్రావోయ్!" నాగు చిరునవ్వు నవ్వుకుంటూ రాగానే సుందరయ్య ఒళ్లోకి లాక్కున్నాడు. ముద్దుముద్దుగా మాటలు చెబుతూ "ఏమోయ్! బళ్లో ఇవ్వాళెన్ని తన్నులు తిన్నావ్? మీ నాన్నేమీ అనడులే చెప్పు... నేనున్నానుగా— భాస్కరం! నీ క్షేమనాకు, చెబుతా డెన్ని తన్నులు తిన్నాడో" అని నాగును సీటుపై కెక్కించి క్రాపు దువ్వుతున్నాడు మెల్లగా. కోటి సైకిల్ క్యారేజీ పట్టుకొని నవ్వుతూ "చెప్పరా!" అన్నాడు మృదువుగా. సుందరయ్య కోటిగాడివంక చూచాడు. ఏవగించుకొంటూ అన్నాడు:

"నాగూ! వీణ్ణెవణ్ణో రోజూ వెంటేసుకొస్తా వేం? వెధవలందరూ—భాస్కర్రావరేయ్! మీవాణ్ణి జాగ్రతచెయ్యాల్సిందే ఇక ... ఇప్పట్నించే ఆఫీసర్ల ఫాయీలో తిప్పితేగాని ఆ కళ పడ దసలు!"

భాస్కరరావు ఆశ్చర్యాణ్ణి పరికించి చూచాడు.

"వీడెవడో తెలుసా?" అన్నాడు సుందరయ్య కోటిని చూచి అసహ్యించుకొంటూ.

కోటిగాడు చిన్నబోయాడు. మనస్సు కుంచించుకుని, తలవంచుకొని తోస్తున్న సైకిల్ కారేజీ వదిలేసి మెల్లగా గోడప్రక్కగా వెళ్లి నుంచున్నాడు నాగుకోసమని. సుందరయ్యచొక్కాగుండీలు మెలి పెడుతూ నాగు దీన్ని గమనించనైనా లేదు. భాస్కరరావు పిప్పరమెంట్లు కొని జేబులో పోశాడు.

"మీనాన్న హెడ్క్లార్కవుతే నువ్వు తాసీల్దారువౌదువుగాని" అంటూ సుందరయ్య క్రిందికి దింపాడు.

"వస్తావా నాన్నా!" అన్నాడు వెనకనుంచి భాస్కరరావు.

వినిపించుకోకుండా, "ఊహూ!"అంటూనే కోటి వద్దకు పరుగెత్తాడు. కోటి ఇంతవరకూ కిల్లీకొట్టుదగ్గర భాస్కరరావు,సుందరయ్యలవేపే చూస్తున్నాడు. ఇగిరిపోయే జలవలె అతని మనస్సులో సంతోషం ఇంకిపోయింది. ఇద్దరూ నాగూఇంటివరకూ వచ్చే టప్పుడు ఏమీ చెప్పుకోలేదు. నాగు పిప్పరమెంట్లు తీసి ఇస్తున్నాడు. అందుకొంటున్నాడు కోటి.

మెట్లెక్కుతూ "కోటీ! మాఇంట్లో కూచుందాం రారా!" అన్నాడు.

"చీకటి పడుతున్నదిగా, మాఇంటిదగ్గర దీపా లుండవ్"

"లేకపోతే ఎట్లా? మాఇంట్లో బొమ్మలు చూద్దువు రారా" అని చెయ్యిపట్టుకున్నాడు నాగు.

"ఊహుహు! వద్దురా...మాఅమ్మ వద్దన్నది... ఏఇంట్లోకీ పోవద్దన్నది"

"ఏం?" అంటూ నాగూ నవ్వుతూ మెట్లెక్కి వెళ్లిపొయ్యాడు.

"తాయం!"అని పిప్పరమెంట్లు నోట్లో విసురు కుంటూ, గంతేసి పరుగుతీశాడు కోటి.

౨

రైలురోడ్డు నానుకొని వాలిపొయ్యే పొలాల్లో పాకీవాళ్ల గుడిసెల కుప్ప వున్నది. క్రిక్కిరిసి, ఒకదానిపై ఒకటి విరుచుకుపడుతూ ఇప్పుడో ఎప్పుడో కూలిపోబోతున్నా యన్నట్లు. సగాలు విరిగిన ఆ గోడల్లోనే గేదెల అరుపులు, దూడల రొచ్చు! మురికిపిల్లలు ఆ బురదలోనే పాకీడబ్బాలు మోగిస్తూ ఆడుకుంటారు. ముసలమ్మలు మూల్గుతూ, వూస్తూ పొగాకు కాలుస్తుంటారు. వూరివారంతా ఆ ప్రాంతా లకే బహిర్దేశానికి వెడతారు. అవసరంగా పొలాల్లోనికి వెళ్లేవారు ముక్కులు బిగించుకొని కళ్లైనా ఎత్తరు. పగటికైలు పొగక్రక్కుతూ వెళ్లేది ఆ కుళ్లు కొంపల మీదనే, రాత్రిరైలు రవ్వలుచిమ్మేదీ వాటిపైనే.

సందెచీకటి క్రమ్ముకొస్తున్నప్పుడు మాచి ఇళ్ల ల్లోనుంచి వంగి వంగి బయటిగట్టుమీదికి వచ్చింది. మాసీ చూడకముందే గొల్లుమన్నది. మళ్లీ వా డొచ్చాడు. పాకీడబ్బా అటు పడేసి తూలిపోతూ, ఇంటికి ఉరుకుతున్న కోటిరెక్క పట్టుకు లాగు తున్నాడు.

"ఏయ్! ఏయ్! నీకు చదువేంట్రా?... నీ బండ చదువు ... లే పైకి, చేతిలో జారిపోతావేం ... డబ్బా ఎత్తుకో! వూళ్లో కెళ్లిరా పో... నేను పోలేను. ఎప్పుడూ నేనేనా ... నేను పెద్దవాణ్ణోయ్ కుంకా!"

కోటి వొణికిపోతూ కెవ్వుమని కేకవేసి "అమ్మా" అన్నాడు. మాచి వెతగా పరుగెత్తి వచ్చింది. దానికి మొదట్నించీ ఆ భయమే! అందుకే గట్టుమీదికి వచ్చి కాచుకు చూస్తుంటుంది ప్రతిసాయం త్రమూ ఆతురతతో. దాని కడుపులో మంట వున్నది. అది పాకీపనిలో కాలం వెళ్లబుచ్చింది. యౌవనంలో విచ్చలవిడిగా సంచరించి భర్తకు కాకపోయింది. భర్త త్రాగుతూ, తిరుగుతూ సుడిగాలివలె బ్రతికాడు. చివరిదశలో క్షయతో మందైనా పోసుకోలేక ఆ

మూరుగుడులోనే ప్రాణం విడుస్తూ, మాచిచెయ్యి పట్టుకు వేడుకున్నాడు: "మనం చూస్తున్నావుగదా... ఉన్న ఒక్కణ్ణీ ఈ గూడెంలో ఎదిగించి డబ్బా చేతికిస్తావా?...ఊపిరి పోయేటప్పుడైనా నన్ను చూడొచ్చావు... వాణ్ణిక్కడ వుంచితే నీ కదీ ప్రాప్తం వుండదు!" ఆ నాటినుంచి కోర్కెగా వున్న ప్రతిజ్ఞ కడుపు దహించింది మాచికి.

పొరపాటున కలిసినప్పుడెప్పుడూ పినతండ్రి కోటిరెక్క పట్టుకోక వదల్లేదు: మాచి కోటిని పినతండ్రిచేయి వదిలించి వెనక దాచుకొని దీనమూర్తి అయింది.

"ఏం నాయనా! మీఅన్న చెప్పలా? మావాణ్ణెందుకు పుటమారుస్తావు...నాలుగేళ్లు పోతే నువ్వు మాత్రం కర్రంపట్టవూ? ఉన్నప్పుడే ఏం వూగిసా..." అని కళ్లు తుడుచుకున్నది.

మాచి పిల్లాణ్ణి బడికి పంపుకున్న దంటే పాకీగూడెంలో పిల్లకూ పిట్టకూ కన్నెర్ర. ఎత్తిపొడుస్తూ, వెక్కిరిస్తూ ఇరుగుపొరుగులంతా వీళ్లను ఒంటరితనంలోనికి తరిమారు.

పినతండ్రి వూగుతూ దగ్గరగా వచ్చి డబ్బా ఒకసారి తన్ని "మాచీ! చిన్నప్పుడు నువ్వెంత సోగ్గా యేసం యేసేదానివే...ఇప్పుడంతా ఐపోయిందిలే— ఒరేయ్! ఒర్, నిన్నే! దాక్కుంటే ఎట్లా, డబ్బా పట్టుకుపో వూళ్లోకి...పలకా పుస్తకా లిటియ్ బళ్లో కెళ్లాలి!" మాచి జాగ్రతగా అతన్ని తప్పించుకు నడిచింది. డబ్బా ఎత్తుకొని ఏవేవో గొణుక్కుంటూ సందులో దూరా డతను.

మురికిగుడ్డనే నీళ్లల్లో ముంచి ఒళ్లంతా తుడిచింది మాచి. బైట పదిఅంగల దూరంలో మసగ్గా వెలుగుతున్న వీధిలాంతరువద్దకు చేరింది కోటిని చంకనెత్తుకొని. మూకుడులో ముద్దలు కలిపిపెడుతూంటే అన్నాడు కోటి:

"దిగుతాలే అమ్మా!" నేలపైకి దించమని.

"మాకన్నా! వొద్దులేయ్యా! బళ్లోకి వెళ్లేప్పుడూ వచ్చేప్పుడూ ఏం పరుగు తీస్తావో! జాగ్రతయ్యా! అటూఇటూ పరకాయించి రోడ్డు దాటు."

"ఏం! నాగూ, నేనూ ఒక్కసారే వస్తాం! బండీ లేదూ భయమూ లేదు... ఒక్క పరుగు పెడ్తే నాగుగారి మేడమెట్లదగ్గరి కొచ్చిపడతాం!"

"బంగారుచిలకవు నీకేం... నాగూ ఎవరు కన్నా?"

"ఎవరంటే! మేమిద్దరమూ ఒకటేగా! ఇదిగో పిప్పరమెంటు వాళ్ల నాన్న వాడి జేబులో పోస్తే ఇద్దరం తిన్నాం..." తీసి, విరిగి మిగిలినది తల్లి పెదవుల్లోని కదిమాడు. తిరిగి అంకుకున్నాడు. ఒక్క పెద్ద నవ్వు నవ్వి "మాష్టారంటే నాగూకు భయమే లేదే...నన్ను సంచి ఎత్తుకురమ్మంటే 'మానాన్నగారు కోటిని పిల్చుకురమ్మన్నా' రన్నాడు. ఇద్దరం వుడాయించాం."

మాచి ఆనందపడ్డది. స్మితం చేసింది. "ఐతే పెద్దపెద్ద సేయితాలు కుదుర్చుకుంటున్నావన్నమాట." సంతోషం పట్టలేక కోటిఒళ్లంతా ముద్దుపెట్టుకున్నది. ఒద్దంటున్నకొద్దీ ముద్దలు నోటిలో తురిమింది.

ఇంట్లో పిల్లాణ్ణి దించి ఆచీకటిగూళ్లన్నీ ప్రమిద కోసం తడిమింది. కనిపించలేదు. "ఇక్కడే వుందు, దీపం తెస్తా"నంటే బిక్కుబిక్కుమంటున్న దని, వుండ లేనన్నాడు. వెంటపెట్టుకొని ప్రక్కసందులోనికి వంగి చూస్తే నలుగురెవరో 'పులిమేక' ఆటలో మునిగి పచ్చి మాటలు మాట్లాడుతున్నారు. ఈమె నెవ్వరూ గమనించలేదు. ఆదీపం వీలుపడ దని పినతండ్రిసందులోనికి వచ్చింది. చిరిగిన చాపమీద రెండు ప్రమిదలూ దగ్గరగా చేర్చి ఏమిటో భాష నేర్పుతున్నాడు ఆదీపాలకు. తల ఎత్తి చూచి గట్టిగా "ఊ" అన్నాడు. మాచిగుండె అదిరింది. అత నింకా మైకంలోనే వున్నాడు. ఇల్లు చేరి ఆ చీకట్లోనే నేలపైన కోటిని కడుపులో పెట్టుకు నిద్రపోయింది.

3

ఉదయం పదిగంటలవేళకు భాస్కరరావుగారు ఆకుమడుపు లందుకొంటూ భార్యను "నాగ

వచ్చాడా" అని అడుగుతున్నాడు. ఈలలు వేస్తూ దూకుళ్లు పెడుతూ వస్తూనే వున్నాడు నాగు. భాస్కరరావుగారికి మెట్లమీదినుంచి నాగుస్వరం వినిపించింది. "మధ్యాన్నం రారోయ్ కోటీ! ఇదుగో బలపంవిసురుతున్నా అందుకో"—అతని మనస్సును కలచివేసింది ఆపిలుపు. నాగు నవ్వుతూ ఇంట్లో పడగానే అతను భార్యను గదిమాడు: "మన నాగూ చూశావా, వెధవపిల్ల లందరి స్నేహితమూ వీడూ ... వాణ్ణొక సారి భయపెట్టు."

ఆయన నాగును గమనించగా, ఎత్తుకోగా భార్య ఎరగ దింతవరకూ. ఆమెకు ఈ జాగ్రత కొత్తగా తోచింది. నాగు తనమీ దేదో పిడుగు పడుతున్నట్లు గ్రహించి గదిలో కెళ్లి ముడుక్కున్నాడు. ఆయన మళ్లీ భార్యను గద్దించాడు: "వాణ్ణిటు పిలూ...మూగమొద్దాలె నుంచుంటా వేం?" భార్య ముహం కందింది. కేక వేసి పిలవగానే నాగు బెదురు చూపులు చూస్తూ ముందుకు వచ్చాడు. తలగుడ్డ చుట్టుకుంటూ భాస్కరరావుగారు అరిచాడు: "చెల్లితో ఇంటో ఆడుకో! పరాయిపిల్లలతో మాట్లాట్టం చూశానా ఒళ్లొలిచేస్తా!" నాగు కంపించిపోతున్నాడు. అకస్మాత్తుగా పారిపోతే బావుండు ననుకున్నాడు. భాస్కరరావుగా రొక్కసారి నాగువంక చూసి "నిన్నే! ఆ కోటితో తిరగడంమానెయ్యి." నాగు నిలవలేకపొయ్యాడు; పరుగెత్తలేక పొయ్యాడు. గాలికి లేచిపోతూ గిరిటీలు కొట్టే ఆకులాగా వున్న దతని మనస్సు. వుండివుండి బావురుమన్నాడు. తల్లి దగ్గరగా వచ్చి కావులించుకొని "మానాయనే! ఏడు పెందుకు ... నీ యిష్టం వచ్చినవాళ్లతో తిరుగు" అని లాలిస్తూ వీపు చరిచింది. భాస్కరరావుగారు హుంకరించుకొంటూ మెట్లు దిగి ఆఫీసుకు వెళ్లిపొయ్యాడు.

ఎప్పటివలెనే కోటీ, నాగూ వీరప్పకొట్లోనే శెనగపప్పు కొనుక్కుంటారు. ఒక్క జేబులోనే పోసుకు తింటారు. పరాయిపిల్లల్ని ఉడుకెత్తించడంలో ఇద్దరూ ఒకటి. పంతులుగారు సీనయ్యను బూకరిస్తారు ఒకే విధంగా ఇద్దరూను.

నాగు కోటితో కిల్లీకొట్టువేపు నక్కినక్కి చూస్తూ ఇంటివేపు నడిచినా తండ్రికంట బడ్డా డొక సారి. సుందరయ్య వేలుపెట్టి చూపుతున్నాడుగూడ. భాస్కరరావుగారు ఇంటికి ముక్కున తుపాను పెట్టుకు వచ్చా డారాత్రి. ఇల్లంతా దద్దరిల్లింది. తనని చేతితో ముద్దచేసి విసిరిపారేస్తాడేమో ననిపించింది నాగుకు.

మరునాటి ఉదయం నాగు బళ్లో చిరునవ్వుతూ వచ్చి కోటిప్రక్కన కూచోలేదు. దాచివుంచిన చోటును చేత్తో చరుస్తూ రమ్మని తల వూపాడు కోటి. గమనించనట్లు దూరంగా తొలిగి వెళ్లి కూచున్నాడు నాగు. పంతులుగారు సీనయ్య పాఠం ప్రారంభించాడు. లెఖ్ఖలు దిద్దించుకోలే దిద్దరూ. వరుసనే పలకలు పిలుస్తూ "కోటీ, నాగూ మీలెఖ్ఖ లేవిరా?" అంటే కోటి తరువాత నాగు పలక అందివ్వలేదు. మొదట, నవ్వులేమో అనుకొని, కోటి, దూరంగా కూచున్న నాగుపైని రహస్యంగా చిన్నచిన్న రాళ్లు విసిరేవాడు. ప్రతిగా నాగు మళ్లీ వాటిని ఏరుకోలేదు. కోటిమనస్సు కారణం ప్రశ్నించుకొంటున్నది. ఎంత పెద్దగా పిలిచినా నాగు "ఊ" అంటూనే ఎటో చూసేవాడు.

సాయంత్రం బడిగంట విని భుజాలపైని చేతులు మెలిచి జోడుగా పరుగెత్తలేదు. పిల్లలగుంపులో అప్పుడే కలిసిపోతున్నాడు. కోటి పరిశీలించేలోపలే దూరమైనాడు. కోటిమనస్సు ఆతురపడుతున్నది. వెనుకనుంచి పిలుస్తూ పరుగెత్తుకొనివస్తే విననట్లు ముహం తిప్పుకొని వెళ్లిపొయ్యాడు నాగు. కోటిని గుండెలో పొడిచినట్లయింది. లేతచీకటి ముసురుకుంటున్నప్పుడు మెల్లగా ఇంటిదారి పట్టి నడిచాడు.

ఆసాయంత్రం మళ్లీ పినతండ్రి పట్టాలవద్ద నిలవేశాడు. "ఆఖు!" అన్నాడు.

తల్లి బైటికివస్తూన్న సమయాన్నే కోటి "అమ్మో!"అని పరుగెత్తాడు. ఆతొందరలో పుస్తకాలు క్రిందికి జారిపోయినై. పలక ముక్కలై ఫ్రేము వదిలించుకున్నది. మాచి కోటి నెత్తుకొని పినతండ్రిని సమీపిస్తున్నప్పటికే అతను వంగి పుస్తకా లొక్కొక్కటే పాకీడబ్బాలో విసిరి "వెధవ! చేజారి

పోయ్యావ్...నీకర్మ చూసుకో... నీగతి చూసుకోరా...నీకు చదువెందుకు" అంటూ పలకముక్కలు లెక్కిస్తూ, తూలుతూ డబ్బాచుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు.

నీళ్లకు వెళ్లే అమ్మలక్కలు కొంతమంది పరిహాసంగా "కోటిగాడి చదు వెంతవరకొచ్చింది" అని ప్రశ్నించారు.

మాచిముహం నిమురుతూ, ఏడుస్తూ కోటి "పుస్తకాలు మాడవే డబ్బాలో వేశాడు...చూడమ్మా! ఎట్లాగే! పలక ఎట్లా అమ్మా!" అంటున్నాడు ఎక్కిళ్లువిడుస్తూ. మాచి కృంగిపోతున్నది. క్రొత్త చొక్కా కుట్టించుదామని నెలరోజులనుంచీ చాకిర్లన్నీ చేసి, అన్నం కడుపులోనికి వెళ్లనివ్వక మిగిల్చిన అణాలు మళ్లీ ఎదురుచూసినై. తను పదిహేనురోజులనుంచి ఒంటిపూట పచ్చడి మెతుకు నంజింది. ఆ కుళ్లుసొరంగాల్లో ఎవరికీ గోచరించకుండా కడుపుమాడ్చుకొని దాచుకున్నది. పినతండ్రి చేతలు, పొరుగువారి ఏవగింపు తనను మంటలమధ్య కట్టివేసినట్లున్నది. కోటి కళ్లు కప్పుకొని ఏడుస్తున్నాడు. మాచికళ్లవెనుక నరాలు జిమ్ముమన్నాయి. నీరు పొర్లింది. కోటికళ్లు అద్దుతూ ఇంట్లోకి తీసుకుపోతూ "దాన్దేమిలే!" అన్నది.

ఆరాత్రి మళ్లీ మసకవెలుతురులాంతరువద్దకు ఎత్తుకొనివచ్చి, అన్నం ముద్దలుచేస్తూ "రేపు మీ నాగును అడుగు నాయనా నాలుగునాళ్లు పుస్తకం చూపించమని...నే నింతలో కొనిస్తానుగా...నాలుగు నాళ్లే" దీనంగా, మెల్లగా అన్నది.

కోటి తల్లిని గట్టిగా కావిలించుకున్నాడు. నాగు మెల్లెక్కి వెడుతూ ముహం త్రిప్పుకోవడం మళ్లీ అనుభవిస్తున్నాడు.

"పలకగూడా అడుగుతావా" అన్నది తల్లి.

కోటిగొంతులో మాటలు ఏడుపు రాచుకొంటునై. "అమ్మా!" అని భోరుమన్నాడు. తల్లి నివ్వెరపోయింది. సముదాయిస్తూ ప్రశ్నిస్తే, నాగు పలకడట. మాచిచేతిలోని ముద్ద రాలిపడి మెతుకులై పోయింది. చేరవస్తున్నట్లున్న దూరపు దీపం దూరమే సాగిపోతున్నట్లనిపించింది. మాచి బ్రతిమలాడినా కోటి అన్నం ముట్టలేదు.

"నాగుతో ఎట్లా మాట్లాడేది..."

"నాగూ, నేనూ కలిసి తిరిగేవాళ్లమే అమ్మా."

"వాళ్ల నాన్నను చూస్తే నా కెందుకో భయమే...."

"నాగు ఎంత మంచివా డనుకున్నావ్..."— అని వెక్కిళ్లు పెట్టాడు. తల్లి ఇంట్లోకి వంగబోతున్నప్పుడు పినతండ్రి దీపం ఎత్తుకుపోతూ ఎదురైనాడు. మాచిభుజంమీదే కోటి నిద్రపొయ్యాడు. కోటిచుట్టూ చెయిచుట్టి ఆ చీకట్లో చాపమీద రాత్రంతా కళ్లు తెరిచేవుంది మాచి.

భర్త తన ఇంటిచుట్టూ, ఇంట్లోనూ తిరుగుతూ "జాగ్రత! జాగ్రత!" అని హెచ్చరిస్తున్నట్లున్నది. రాత్రంతా తమ జీవితాలకు పశ్చాత్తాపంగా ఆడింది గుండె. గుడిసెల్లో పొగలాగా వెలువడుతున్న శబ్దాలూ, తనను సూటిగా గ్రుచ్చుకునే వెటకారాలూ వింటూ తెల్లవార్చుకున్నది.

౪

కోటి పాడిచేతులతో బడి కెడుతోంటే డబ్బాలెత్తుకొని వీథులకు చీలిపోతున్న కుర్రాళ్లలో ఒకడు డబ్బా చేతి కందివ్వబోయినాడు. ప్రక్కగా తప్పుకున్నాడు కోటి. మాచి చూస్తూ "ఒరేయ్! ఏమమ్మా మిడిసిపడతావ్...నీ తమ్ము డనుకోలేవూ... అంత పొగ రెందుకయ్యా!" అంటూండగానే మరో ఆమె చేతులూపుతూ వచ్చి "ఉస్సూ ఉస్సు! నువ్వు గాగ చదివిస్తున్నావని అందరూ పొగరుమోతులూ పోకిరీలూ . . నోరు చేసుకునేవు మర్యాదగాదు ... ఐనా ఏ మేడుస్తాడో చూద్దాముగా చదివి ..." అంటూ రాచుకొంటూ నడిచింది. ప్రక్కనే చోద్యం చూస్తున్న కొందరు "ఊరుకుంటావేమే!" అన్నట్లు వుసిగొల్పారు. మాచిగొంతు మూసుకుపోయింది. లోపలికి వెళ్లిపోయింది సరాసరి. బైట తిరిగే పొరుగమ్మలు "ఇంతేలే!" అన్నట్లు తలలు విసురుకొంటూ ఇళ్లు దూరారు.

కోటి వాకిట్లోనే నాగువంక చూశాడు. ఎప్పుడు వస్తాడా అని ఎదురు చూస్తున్న నాగు లోపలికి అడుగు పెట్టగానే తల వంచుకున్నాడు. తన స్థలంలో కూచుని దిక్కులు చూస్తూంటే పంతులుగారు గద్దించాడు పలకాపుస్తకాలకోసం. "నాగూ! నీ పుస్తకం చూపించరాదూ...ఇటు రా" అన్నాడాయన. నాగు ప్రక్కకు చేరకతప్పలేదు. కూచోగానే భుజంమీద చెయి వుంచి నాగుముహంవంక చూచాడు కోటి. నాగునాళాల్లో నెత్తురు వుసిగా పరుగెత్తింది. కందిన ముహంతో కోటిపైకి వొత్తిగిలి భుజంమీద తలవాల్చాడు. కోటి నవ్వుతూ పుస్తకం తెరిచాడు.

బడివేళ కాగానే మళ్లీ నాగు పిల్లలతో కలిసి వెళ్లిపోతున్నాడు. కేక వేస్తున్నా, చప్పట్లు చరుస్తున్నా, "ఓయ్!" అంటూనే దాటిపొయ్యాడు. కోటి పరుగెత్తుకొనివచ్చి పిలుస్తూంటే కిల్లీకొట్టుదగ్గర సుందరయ్య నాగుబుగ్గలు పట్టుకు నవ్వులాడుతున్నాడు. కోటి బెరుకుగా చూస్తూ పుచ్చుకున్న నాగుపుస్తకం అక్కడ పెట్టేసి నిశ్శబ్దంగా దారిపట్టాడు.

భాస్కరరావుగారు పళ్లు ఒత్తిపట్టి అతను మలుపు తిరిగేవరకూ కళ్లు గాలిలో పెట్టుకు చూచాడు.

మాచి ఆరాత్రి అన్నం పెడుతూన్నప్పుడు అన్నీ శ్రద్ధగా ఆకళింపు చేసుకున్నది. ఏదోవిధంగా కోటిని సంతోష పెట్టి కృత్రిమసంతృప్తి పొందవలెనని వ్యర్థయత్నం చేసింది.

"నాయనా! నాగూకూడా మంచివాడేరా... నీతో ఎందుకు మాట్లాడడూ...ఏదో దూరదూరంగా వుంటున్నాడనేగానీ..." కోటి తల్లి ఒడిలో తలవుంచి నిద్రమంపులో "ఊ"అన్నాడు.

బైట ఎవరిదో లాంతరు నడిచిపోతూ, వెలుతురు వచ్చి మాచిముడుతలు తేరిన ముహంమీద క్షణం ఆడింది. ఆమెవేదనను కండ్లకు కట్టింది. నలిగిన కళ్లలో వెలుతురు తడిగా మెరిసింది.

"రేపు పలకరించు నాయనా! సిగ్గుపడేవు... నాగు అంటే నీ కెంతో యిష్టం గదూ...పలకరిస్తావా!"

కోటి కళ్లు తెరిచి "సరేలేవే!" అంటూ ఒడిలోనే ప్రక్కకు ఒత్తిగిలాడు.

పడుకున్న మాచికి పూర్వస్మృతులు మళ్లీ జీవించాయి. తను విశృంఖలంగా మనస్సును పరుగెత్తించిన రోజులు తేరిచూస్తే ఇప్పు డీచలిలోకూడా గుండె వడిగా కొట్టుకుంటున్నది. భర్తతో తను కలిసివున్నప్పుడు జీవితాన్ని జలపాతంవలె గడిపింది. గుడిసెల్లోని బంధువులంతా ఏదో పని వున్నట్లు వచ్చి ప్రేమగా మాట్లాడేవారు. రహస్యంగా తననుగూర్చే ప్రసంగించేవారు. భర్తచావు దాపురించేనాటికి పిల్లాడికి రెండో ఏడు. పంజరంలోని పావురాయిని చిత్రవధ చేసినట్లు తనను తాను ధ్వంసంచేసుకున్నాడు భర్త. అతను కంటి ముందు తిరిగినట్లే కనిపించింది. అతని బరువైన అడుగుల చప్పుడు వినిపిస్తున్నది. త్రాగివచ్చి, గుడిసెల్లో అందరిపైనా తొడకొట్టడమూ, ఊరిలో ఎవరితోనో కయ్యానికిదిగి రక్తసిక్తవస్త్రాలతో రొజుకుంటూవచ్చి ఇంట్లో పడటమూ దృశ్యాలుగా తోస్తున్నాయి. అవసాన సమయాన అతని మాటలు మళ్లీ జ్ఞప్తికివచ్చి కంపించింది.

"నాకోటి! మాకన్న! మాఅదృష్టం!" అనుకొంటూ కోటిని గుండెకు ఒత్తుకొంటూ కన్నుమూసింది.

ఏ

ఉదయం కోటి బళ్లోకెళ్లి నాగూను ఎప్పుడు పంతులుగారు దగ్గరగా రమ్మంటారా అని ఎదురు చూస్తున్నాడు. పంతులుగారు సీనయ్య లెఖ్ఖలపలకలు దిద్దుతూనే "కోటీ!" అన్నాడు. కోటి లేచి నిలిచాడు. పంతులుగారు సీనయ్య కళ్లజోడు పైకి లాగి తీరికగా చూస్తూ "దయచెయ్యొచ్చు!" అన్నాడు.

నాగు తల ఎత్తి చూచాడు.

మళ్లీ ఆయన—"ఏమిరా! నీగ్గాదూ చెప్పేదీ! పో..."

కోటి వొణికాడు. "ఏమిటండీ?"

"పో బైటికి...ఇక్కడెవరూ లేరు తేరగా పాఠాలు చెప్పేందుకు..."

నిష్కారణమైన ఈ కోపానికి కోటి అంతర్నాళాలు జలదరించాయి. వొణుకుతున్న చేతులతో కోటి గొణిగాడు: "నాగు దగ్గర చూస్తానండి పాఠం. ...ఇవాళొక్కరోజేనండి... పుస్తకాలు రేపు తెచ్చుకుంటానండి."

కుర్చీమీదినుంచి కాళ్లు క్రిందికి దించి—"మా అయ్యగాని, ముందు బైటికి నడు...రేపణ్ణుంచీ బడికి రానక్కర్లేదు... తెలిసిందా...హాజరుపట్టీలో నీపేరు కొట్టేశాం..."

కోటి ఇంకా నిలిచేవున్నాడు. నాగువంక చూచాడు...పంతులుగారి ముహంలో దీనికేమైనా కారణం స్ఫురిస్తుందేమోనని వెతికాడు.

"తెలిసిందా!" అన్నాడాయన పెద్దగా. "వెళ్లు...నాగుతో మాట్లాడావో, ఒళ్లు చీలుస్తాను జాగ్రత!"

నిర్విణ్ణుడై, వినమ్రుడై నుంచున్నాడు కోటి. క్లాసులో పిల్లలంతా పలకలు దిద్దడం, బలపాలు చాదడం మాని కోటివంక చూస్తున్నారు.

పంతులుగారు సీనయ్య విశ్రాంతి తీసుకునే కొన్ని నిముసాలు ఉదాసీనత వహించాడు. "నిన్నేరా అబ్బాయి,పో!తర్వాత భాస్కరరావుగారూరుకోరు".

కోటి మెల్లగా చెప్పుకున్నాడు: "పొమ్మంటారాఁ?"

"ఆహా!" అని నవ్వాడు పంతులుగారు.

నాగువంక చూస్తూ కోటి వాకిలిదాటి బైటికి వస్తున్నప్పుడు పిల్లలంతా అతనివంకనే చూస్తున్నారు. నాగు ఊపిరి బిగబట్టి తల వంచుకొని చదివిన పంక్తినే తిరిగితిరిగి చదువుతున్నాడు.

పదిగంటలవేళ బజారంతా నిండుగా వుంది. పల్చని ఎండ చిక్కనై వెచ్చనిగాలులు క్రక్కుతున్నది. గొడ్లకాపరి ఆవుల్నీ, గేదెల్నీ తోలుకుపోతున్నాడు. గంట విని పిల్లలంతా ఇళ్లకు చీలిపోతున్నారు.

వాకిలిప్రక్కగా ఒదుగుకొని కూచునివున్నాడు కోటి. పిల్లలంతా వేలితో చూపుతూ, గుసగుసలాడుతూ వెడుతున్నారు. నాగు గడప దిగగానే కోటి "నాగూ!" అని పిలుస్తూ లేచాడు. నాగు తిరిగి చూచాడు. ఇప్పుడేమి చెయ్యాలి? నాగుకు తోచలేదు. నుంచున్నాడు. కోటి దీనవదనంతో సమీపిస్తున్నాడు. నాగు కదలడం ప్రారంభించి, వడివడిగా నడిచి, పరుగెత్తుతున్నాడు. కోటి "ఇదేమిటి?" అనుకున్నాడు.

"నాగూ! ఓనాగూ! ఉండవోయ్" అని కేకలు వేస్తూ వెంబడించాడు. నాగు వీథి తిరిగి ఇంటివేపు ఒక్క పరుగు తీశాడు. అందలేదు. అతనట్లా పరుగెత్తుతూ ఉండటానికి కారణం ఏమీ స్ఫురించలేదు తిరిగివస్తున్న కోటికి. ఇంతసేపటినుంచీ గడప బైట కనిపెట్టుకు కూచుంటే నాగు పిలుపు వింటూనే, "ఆ!" అంటూనే తప్పించుకున్నాడు. మలుపు తిరిగేటప్పుడు నాగు ఏడుస్తున్నట్లు స్పష్టంగా కనిపించింది. కలుసుకోవడానికి ప్రతిబంధకాన్ని నిర్మించుకొని కోటిమీది అనురాగంవల్లనే ఏడుస్తున్నాడని అతను గ్రహించలేదు.

కోటికి ఇంటికి ఒకే త్రోవ. ఎందుకో తెలియని బాధ ఒళ్లంతా ఆవరించి వెక్కిళ్లుపెడుతూ, నాగు వెళ్లిన దిక్కుగా చూస్తూ, చేతులు నలుముకొంటూ ఇంటికి వచ్చి ఆవురుమన్నాడు. త్రోవలో తల ఎత్తితే ఇదంతా కనిపెట్టి వుండిన ఏదో దొంగకన్ను పరిహసిస్తున్నట్లనిపించింది. పంతులుగారు సీనయ్య గద్దింపులకు మనస్సు దద్దరిల్లుతున్నది ఇంకా.

మాచి ఒక్కొక్కమాటా వింటూ క్రుంగిపోయింది. ఇరుగు పొరుగమ్మలు గోడలవెనుక చెవులు రిక్కించి వింటున్నారా అనుకున్నది. భర్త కడసారి చెప్పుతూ ఆమెచెయ్యి పట్టుకోవడం జ్ఞాపకానికి వచ్చింది. పంతులుగారు దేనికి వెళ్లిపొమ్మంటాడు? ఎప్పటికీ ఎందుకు రావద్దంటాడు? మాచికి పాలుపోలేదు. కరవలేనిపామును అందరూ త్రొక్కుతారు.

"నాగు ఏమన్నాడు నాయనా! మరి పంతులుగారితో చెప్పలేదూ... నీ ప్రక్కనే కూచోలేదూ ఇవ్వాళ కూడా?"

కోటి తల దించి అన్నిటికీ "ఊహూ" అంటూ చినిగిన పమిటచెరగు కళ్లకు కప్పుకున్నాడు.

"నీకర్మ! నాగును పలకరించమని రాత్రి చెప్పలేదూ?"

"పలకరించానే!" స్వరం గాద్గదికమైనది.

"ఏమన్నాడు?"

"ఏముంది?"

"పో ... నీకర్మ!" మాచి దిక్కుతోచని దుఃఖంలో విసుగుపడ్డది.

ఇరుగమ్మ ఎవ్వరో వచ్చి అప్పుడే కోటితో నవ్వులాడుతున్నది చదువునుగురించి.

౬

దూదిబత్తులైన కాళ్లను మెల్లగా ఈడ్చుకొంటూ మాచి స్వయంగా బడివద్దకు వచ్చిచేరింది. సాయంత్రంగంట మ్రోగేవరకూ, తలుపు తెరుచుకున్న ప్రతీసారీ కష్టంమీద లేచి నుంచుంటూ, పంతులుగారు కాడని తెలియగానే కూలబడి ఎదురుచూస్తున్నది.

పిల్లలు బైటికి పార్లివస్తూ మాచిని చూచి వెక్కిరిస్తూ, నవ్వుతూ వెళ్లిపోతున్నారు. పంతులుగారు బెత్తం ఊపుతూ తలుపు తాళం వేస్తూండగానే మాచి చేతులు రెండూ కలిపి "అయ్యా! ఓఅయ్యా! మీరేనయ్యా పంతులుగారు!" అన్నది బావిలోనుంచి మాట్లాడిన స్వరంతో, బావిలో పడ్డదానివలెనే.

"ఏం ?" అన్నాడు.

"కోటి మావాడేనండీ!"

"ఓహో! తెలిసింది... తెలిసింది. కోటిగదూ!... లాభంలేదు...ఐనా వాడికి చదు వెందుకే పిచ్చి ముండా..." చిరునవ్వు నవ్వాడు బెత్తాం గాలిలో విసురుతూ.

"ఏదో మావాణ్ణిగూడా గట్టున పడేద్దామని... దయవుంచండయ్యా..."

"దేముడే దయుంచాలి...నాచేత కాదు... ఆభాస్కరరావుగారి నడుకోక్కక పొయ్యావా,ఇక్కడ గొణక్కపోతే!"

"నాగుగారి తండ్రా ?"

"ఎవరి తండ్రో...మాప్రాణం తీస్తారు...పో పోవే ఇప్పుడు మీవాడిసంగతీ నీసంగతీనూ" పంతులుగారు సీనయ్య సాగిపోతున్నాడు.

"ఓ అయ్యా! భాస్కరరావయ్యగార్ని అడుకోమంటారా! ఐతే మీవల్ల కాదంటారా!"

వెనుకకు చూచాడు మాచివంక. బెత్తం గిరున త్రిప్పాడు నేలమీద.

"పళ్లూడగొడతాడు ఆయ నడిగితే, తెలుసా? వెళ్లు ముందు...మీకు చదువు లెందుకే పిచ్చిముండా!" నవ్వుతూనే అన్నాడు.

మాచి వెలిగించుకున్న దీపపుబత్తి క్రమంగా లోపలికి ముంచుకు పోతున్నది. వెలుగు సన్నగిలి దీపం రెపరెపలాడింది.

"ఐతే... ఏం చెయ్యమంటారు... ఏదైనా చెప్పండయ్యా!" సన్నగా దీనంగా, ప్రార్థనగా, అడిగింది.

ఆయన మాచిని సర్వవిధాలా అనుకరించాడు.

"ఏమంటారు" అన్నది మళ్లీ.

"ప్రయోజనం లేదు పో...పొరపాటున ఆయన దగ్గరి కెళ్లేవు...బ్రతికి ఇంటికి పోవు" బెత్తాంతో గాలికి గూడా అక్షరాలు నేర్పుతూ దారితీశాడు.

మాచి తిరిగి, వచ్చినత్రోవనే మెల్లమెల్లగా కాళ్లీడ్చుకొంటూ ఇల్లు చేరింది. క్రింద పడిపోతుందేమో అన్నట్లు ఒకచేతితో గుండె పట్టుకున్నది. త్రోవపొడుగునా ఏమేమో గొణుగుకొంటున్నది. నెరిసీనెరియనట్లు వెంట్రుకలలో వ్రేళ్లు దూర్చి విసుగ్గా ఆడిస్తూ తనకు తెలియకుండానే ఇంటివద్దకు వస్తున్నది.

ఇంటిబైట మసక వెలుతురు చిమ్ముతున్న లాంతరుప్రక్కగా కాళ్లలో తల దూర్చి కూచున్నాడు కోటి గట్టుమీద. మళ్లీ పినతండ్రి తప్పత్రాగి, పసిబట్టి కొనవూపిరితో వెంటబడ్డ త్రాచువలె లేస్తూ, పడుతూ

పాడుతూ, తూలుతూ వస్తున్నాడు. సరాసరి వచ్చి కోటిరెక్క పట్టుకు లాగుతూ—"పనిలోకి వెళ్లకుండా నిద్రపోతున్నావా కుంక ... ఇదుగో!" అని డబ్బా గట్టిగా నేలమీద కొడుతున్నాడు. "నేను పోలేను... ఎవరుచేసిచస్తారీపని ... నీఅబ్బకంటె మిడిసిపడతావా..."కోటి అతని కరకుచేతుల్లో మెలికలై తిరిగిపోతున్నాడు. "అమ్మా! అమ్మా!" అని ఏడుస్తున్నాడు.

మాచి గట్టుమీదికి వచ్చి ఏడుపు విని తలఎత్తి చూచింది. రాతిలో కప్పలాగా ఆమెలో బ్రతికిన భర్తకోరిక నిర్జీవమైపోతున్నది. ఆమెలో సహనం పూర్తిగా జారిపోయింది. మనస్సుకు ఇప్పటివరకూ పట్టిన గొడుగువంటి ఆశ వికావికలై చినిగిపోయింది. చూస్తూనే, దగ్గరగా వచ్చి, నిశ్శబ్దంగా రెండోరెక్క పట్టుకొని, విడిపించుకుపోతూ "ఏం! పోరాదూ?" అని వెగటుగా అన్నది. "మీ నాయనకంటె పాడుస్తావా నువ్వు!"

ప్రక్క ఇండ్లవాళ్లు, గట్టుమీద నడిచేవాళ్లు ఆగి విన్నారు ఆశ్చర్యంగా. ఇళ్లల్లోవారు నవ్వుకుంటూ బైటికివచ్చి ఆగారు. బరువైన కొయ్యను మాదిరిగా కోటిని ఇంట్లోకి లాక్కుపోతూంటే అతను పెనవేసుకొని "అమ్మా!" అంటున్నాడు.

మాచిరెప్పలనిండా నీరు నిండింది. లోపల చాప మీద కోటిని పడవేసి తను పడుకొంటూ—

"ప్రొద్దున్నే పాకీబండి తోలుకు పోదువుగాని ... మీ నాయన దానిమీదే వుండేవాడు" అన్నది.

ఆ రాత్రి మాచి ఒళ్లుతెలియని గాఢనిద్ర పోయింది.